క్లుప్తంగా

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. మేళాలో శ్రీరాజా బ్యాగ్స్, వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్, అమెజాన్, ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు 35 మందిని ఇంటర్వ్యూలు చేసి 18 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, జిల్లా ఉపాధి కల్పన ఉద్యోగి చాంద్‌బాషా పాల్గొన్నారు.

కబడ్డీ విజేత రాయలసీమ యూనివర్సిటీ



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి భోగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కబడ్డీ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ జట్టు విజయం సాధించింది. గురువారం ప్రారంభమైన కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ ప్రథమ, బేతంచెర్ల మండలం యంబాయి ద్వితీయ, పాణ్యం మండలం తమ్మరాజుపల్లె తృతీయ, ఓర్వకల్లు మండలం గుట్టపాడు జట్టు నాల్గో స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6 వేలు, రూ. 4 వేల నగదు బహుమతులను అందజేశారు.

వేడుకగా చౌడేశ్వరి పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి మంగళహారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

ఉచితంగా చికెన్ వంటకాలు పంపిణీ



చికెన్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

ప్యాపిలి: స్థానిక కలచట్ల రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం ఉచితంగా చికెన్, కోడిగుడ్డుతో చేసిన వంటకాలను పంపిణీ చేశారు. బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ తినడాన్ని పూర్తిగా తగ్గించేశారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉచితంగా చికెన్ పకోడ, ఫ్రై, మంచూరియా, ఉడికించిన గుడ్లు పంపిణీ చేశారు. జలదుర్గం పశువైద్యాధికారి విద్యాసాగర్ రెడ్డి పరిశీలించారు. బాగా ఉడికించిన ఆహార పదార్థాల్లో ఎలాంటి వైరస్ ఉండే అవకాశం లేదన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని బేతంచెర్లలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. గోరుకల్లు రిజర్వాయర్ నీటిని నిల్వ చేసుకోవడానికి రూ.1.20 కోట్లతో 3 సంపుల నిర్మాణం, మరో రూ. 30 లక్షలతో బోర్లు వేయించడం, మరమ్మతులకు గురైన ట్యాంకులు, పైపులైన్ పనులు చేపట్టడం కోసం సభ్యుల ఆమోదంతో తీర్మాణం చేశారు. కోటపేటలో రోడ్డుపైనా సంత నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, అధునాత వసతులతో నిర్మించిన సంత మార్కెట్‌లో వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చలంరెడ్డి నగర పంచాయతీ అధికారులను కోరారు. నగర పంచాయతీ పరిధిలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వలు, పైపులైన్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.21 కోట్ల నిధులు మంజూరు చేయడంపై డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి, సీఎం చంద్రబాబుకు చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరిప్రసాద్, వార్డు కౌన్సిల్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



బనగానపల్లె: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న సైన్స్ అధ్యాపకుడు



కోవెలకుంట్ల: సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్



సంజామల: సైన్స్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విజ్ఞానం.. వ్యక్తిత్వ వికాసం



అవుకు: ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ-2

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కాలక్రమేణా సైన్స్ కొత్త పుంతలు తొక్కుతోందని.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. –సాక్షి నెట్‌వర్క్



డోన్: పాతపేట జెడ్పీ హైస్కూల్లో రామన్ చిత్ర పటానికి నివాళి



ప్యాపిలి: హుసేనాపురం ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయులకు సన్మానం



కొలిమిగుండ్ల: సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ



బేతంచెర్ల: రంగాపురంలో విద్యార్థుల సైన్స్ ప్రదర్శన



బనగానపల్లె: విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ నమూనాలు

నేటి ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బనగానపల్లె రూరల్: పట్టణంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 220 మంది, కేజీఆర్ జూనియర్ కళాశాలలో 282, ఎస్‌వీ జూనియర్ కళాశాలలో 218 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు ఆనందరావు, విశ్వనాథ్, తిరుమలయ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

రెండు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

కోవెలకుంట్ల: పట్టణంలోని రెండు జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపర్‌వైజర్లు రమాదేవి, ఉమాదేవి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో జూనియర్ ఇంటర్‌లో 224 మంది, సీనియర్ ఇంటర్‌లో 170 మంది, పట్టణ శివారులోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 224 మంది, ద్వితీయ సంవత్సరంలో 124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

పరీక్షలకు సిద్ధం

ప్యాపిలి: ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు తెలుగు పరీక్ష ఉంటుందన్నారు. మొత్తం 149 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

- డోన్ టౌన్: పట్టణంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ 314, సెకండ్ ఇయర్ 255, శ్రీసుధలో ఫస్ట్ ఇయర్ 384, ద్వితీయ సంవత్సరం 269, శ్రీవెంకటేశ్వర కళాశాలలో 302, 238, మోడల్ స్కూల్లో ఫస్ట్ ఇయర్ 272, సెకండ్ ఇయర్ 227 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఘనంగా టైలర్స్ డే

కోవెలకుంట్ల/బేతంచెర్ల: కోవెలకుంట్ల, బేతంచెర్లలో టైలర్స్‌డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విలియమ్ హూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కోవెలకుంట్ల మండల కో ఆప్షన్ సభ్యుడు, టైలర్ల సంఘం అధ్యక్షుడు దిల్కాబాషా, సంఘం నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఉసేని, గుంజలపాడు బాషా, రాముడు, బ్రహ్మం, రాజు, హరికృష్ణ, జులేఖాబి, దౌలత్‌బీ, అహమ్మద్‌బాషా, బేతంచెర్ల మండల టైలర్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

నేడు శివదీక్ష విరమణ

బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు శివ దీక్ష స్వీకరించిన మాలధారులు శనివారం దీక్ష విరమించనున్నారు. ఉదయం పాతపాడు ముఖ ద్వారం నుంచి పాదయాత్రగా యాగంటికి చేరుకుంటామని కాటసాని తెలిపారు. శివస్వాములకు ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంత్రంలో అన్నదానం ఉంటుందని చెప్పారు.

గాడిచెర్ల సేవలు చిరస్మరణీయం

- కోవెలకుంట్లలో గాడిచెర్ల 66వ వర్ధంతి



గాడిచెర్ల హరిసర్వోత్తమరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ఆంధ్ర తిలక్‌గా పేరుగాంచిన గాడిచెర్ల హరి సర్వోత్తమరావు సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. గాడిచెర్ల 66 వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కోవెలకుంట్లలో ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి మాట్లాడుతూ.. కర్నూలుకు చెందిన భగీరథీబాయి, వెంకటరావు దంపతులకు 1883 సెప్టెంబర్ 14వ తేదీ గాడిచెర్ల జన్మించారన్నారు. లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్‌ను స్ఫూర్తిగా తీసుకుని స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సాహిత్యం, వయోజన విద్య, గ్రంథాలయోద్యమం, పత్రికా రచన, సంఘసంస్కరణ, సంఘీభావ ప్రకటనలు, సభలు, సమావేశాలతో గాడిచెర్ల జీవితం ముందుకు సాగిందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి పీఠం సభ్యులు శివారెడ్డి, బాలాంజనేయరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్యామ్‌బాబు, బన్ని యాదవ్, మహేశ్వర రెడ్డి, రాములమ్మ, బిలాల్, రంగన్న పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



యాగంటి ఉమామహేశ్వరుని రథోత్సవంలో భక్తుల రద్దీ

బనగానపల్లె రూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవిగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చి రథోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నంద్యాల కళాకారుల కోలన్న కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. సీఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరమ్మ, ఆలయ ఈఓ చంద్రుడు, ఆలయ మాజీ చైర్మన్ దొనపాటి యాగంటి రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

- బేతంచెర్ల: హెచ్‌కొట్టాల సమీపంలోని ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారి రథోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. మేళతాళాలు, భక్తుల శివనామస్మరణ నడుమ స్వామి వారు రథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.
- డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కొత్త బుగ్గ, పాత బుగ్గలో రామలింగేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ఆలయ కోనేరులో తెప్పోత్సవం..అనంతరం రథోత్సవం వేడుకగా జరిగింది. భక్తులు హరిహర శంకర శంభో శంకరా అంటూ తేరులాగుతూ భక్తి పారవశ్యంతో మునిగి తేలారు. సీఐ ఇంతియాజ్‌బాషా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



బేతంచెర్ల: ముచ్చట్ల మల్లికార్జునస్వామి రథోత్సవం



డోన్: కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి తెప్పోత్సవం

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



పోటీలు తిలకించేందుకు తరలివచ్చిన జనం

- తిలకించేందుకు భారీగా తరలివచ్చిన జనం
- విజేతలకు బహుమతుల పంపిణీ

కొలిమిగుండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు శుక్రవారం అట్టహాసంగా ముగిశాయి. రెండో రోజు జరిగిన యుకేటగిరి విభాగం పోటీలను వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. పోటీలు ఆలస్యంగా జరిగినా మండుటెండను లెక్కచేయకుండా వివిధ గ్రామాల నుంచి ప్రజలు, రైతులు భారీగా తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. పోటాపోటీగా సాగిన పోటీల్లో ప్యాపిలి మండలం డి.రంగాపురానికి చెందిన జూటూరి రామకృష్ణారెడ్డి, డోన్ మండలం మల్లెలకు చెందిన షేక్ మైమున్నీకి చెందిన కంబైన్డ్ వృషభాలు 20 నిమిషాల వ్యవధిలో ఎక్కువ దూరం లాగి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. అలాగే డి.రంగాపురానికి చెందిన జూటూరి రామకృష్ణారెడ్డి, అనంతపురం జిల్లా యాడికి మండలం అప్పారెడ్డిపల్లెకు చెందిన సిద్ధవటం దేవేంద్రరెడ్డికి చెందిన కంబైన్డ్ వృషభాలు రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెద్దకోట్లకు చెందిన సురేంద్ర వృషభాలు మూడో స్థానంలో నిలిచాయి. కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెకు చెందిన తిరునాథరెడ్డి వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వృషభ యజమానులకు రామ్‌కో సిమెంట్ సహకారంతో వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలను అందించారు. అలాగే వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన చెన్నకేశవ వృషభాలకు కన్సోలేషన్ బహుమతి కింద రూ.20వేలను జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రామ్‌కో యూనిట్‌హెడ్ రెడ్డినాగరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, డీలర్ వెంకట్రామిరెడ్డి, యాతం సుబ్బారెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీని నియమించాలి

కోవెలకుంట్ల: ఎన్నికల హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి 12వ పీఆర్సీని వెంటనే నియమించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 2023 జులై నుంచి నూతన పీఆర్సీ అమలు చేయాల్సి ఉందన్నారు. 2024 జనవరి, జులై, 2025 జనవరి నెలలకు సంబంధించిన మూడు విడతల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పండుగలు సంస్కృతికి చిహ్నాలు

డోన్ టౌన్: పండుగలు, తిరునాళ్లు సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలని.. ఐకమత్యంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పాతబుగ్గ, కొత్త బుగ్గ, రామచంద్ర మాలిక్‌బాబా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాలకు వచ్చిన ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం




న్యాయవాదులు, పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి

- జిల్లా జడ్జి లీలా వెంకట శేషాద్రి

డోన్ టౌన్: లోక్ అదాలత్‌లో దీర్ఘకాలిక సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. శుక్రవారం డోన్ పర్యటనకు వచ్చారు. సబ్ జైలు తనిఖీ చేసి సౌకర్యాలు, భోజన, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేని రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయసేవలు అందిస్తామని ఖైదీలకు సూచించారు. అనంతరం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం అయ్యారు. ఈ నెల 8వ తేదీ జరిగే లోక్ అదాలత్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీ అయ్యే కేసులు ఉంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడం ఉత్తమం అన్నారు. ఈ విషయాన్ని కక్షిదారులకు తెలియజేసి అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్, పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా పాల్గొన్నారు.

అరటి రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్యాపిలి: అరటి రైతులు పంటకు చీడపీడలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, మహానంది సీనియర్ శాస్త్రవేత్త కిశోర్ అన్నారు. ప్యాపిలి మండలం చంద్రపల్లి, ఊటకొండ గ్రామాల్లో శుక్రవారం అరటి రైతులకు అవగాహన కల్పించారు. సస్యరక్షణ చర్యల్లో భాగంగా ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, చీడపీడల యాజమాన్యం పాటించాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా చీడపీడలను అరికట్టవచ్చన్నారు. వారి వెంట ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు